## ప్రభుత్వ దవాఖాన సందర్శన



అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

చెన్నూర్, ఫిబ్రవరి 21: చెన్నూర్ ప్రభుత్వ దవాఖానను కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలపై సభ్యులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ ఆరా తీశారు. అవుట్ పేషెంట్లకు అందుతున్న వైద్యాన్ని పరిశీలించారు. దవాఖానలోని రికార్డులను తనిఖీ చేశారు. దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే మండలంలోని అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని సందర్శించారు. దవాఖాన స్థితిగతులను పరిశీలించారు.


## ముగిసిన లోకో పైలట్ల నిరసన



నిరసన దీక్షలో పాల్గొన్న లోకోపైలట్లు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21 : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని బెల్లంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే లోకో పైలట్లు చేస్తున్న నిరసన దీక్ష శుక్రవారం రాత్రి ముగిసింది. దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న డ్రైవర్లు, గార్డుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 36 గంటల నిరసన దీక్ష గురువారం ప్రారంభమవగా, ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు చింతల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకో పైలట్లు మాట్లాడుతూ.. రైల్వేలోని అన్ని విభాగాల్లో అమలు చేస్తున్న రన్నింగ్ అలవెన్స్ 25 శాతం రన్నింగ్ స్టాఫ్‌నకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవు రన్నింగ్ స్టాఫ్‌నకు 36 గంటల నుంచి 46 గంటలు పెంచాలని కోరారు. గూడ్స్ పైలట్లకు 8 గంటల పని విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. బెల్లంపల్లి బ్రాంచ్ అధ్యక్షుడు పటేల్, కార్యదర్శి అజయ్, నాయకులు వివేక్, మౌర్య, రవీందర్, ఫియాన్స్, రన్నింగ్ స్టాఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాసులు కడితేనే ఎల్‌ఆర్‌ఎస్





### ఎన్నికల ముందు ఉచితమని.. ఇప్పుడు మాట మార్చిన కాంగ్రెస్ సర్కారు



- గతేడాది మొత్తం కట్టాల్సిందేనని.. ఇప్పుడేమో 25 శాతం రాయితీ అంటూ బుకాయింపు
- ఉమ్మడి జిల్లాల్లోని 11 మున్సిపాలిటీల్లో 66,095 పెండింగ్ దరఖాస్తులు
- ఆ అప్లికేషన్లపై ఇప్పటికీ కొనసాగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన
- సామాన్యులపై పెనుభారం.. ఆశలు గల్లంతు

మంచిర్యాల, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను రద్దు చేస్తాం. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు కొనుగోలు చేసిన లే-అవుట్‌లలోని ప్లాట్లను ఉచితంగా క్రమబద్ధీకరిస్తాం.' అన్న హామీని కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విస్మరించింది. కాంగ్రెస్ గెలిస్తే పైసా కట్టకుండా ప్లాట్లు, లే-అవుట్లు క్రమబద్ధీకరించుకోవచ్చని ఆశలు పెట్టుకున్న సామాన్యులపై గుదిబండ వేసింది. ప్రజలకు ఇచ్చిన మాటను పక్కన పెట్టి కాసుల వేటలో తలమునకలైంది. గతేడాది గెలిచీ గెలవగానే.. ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయడం కుదరదు.. 2020లో దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి రుసుము చెల్లించి లే-అవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలంటూ బాంబు పేల్చిన సర్కారు, సిబ్బంది కొరత, క్షేత్రస్థాయి ఇబ్బందుల నేపథ్యంలో దాన్ని వాయిదా వేసింది. కొన్ని నెలలుగా ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులపై అధికారులను పురమాయించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగుతున్న నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ఉచితం అన్న హామీ గురించి ఎలాంటి ప్రస్తావన లేకుండా.. మార్చి 31లోగా చార్జీలు చెల్లించే వారికి 25 శాతం రాయితీ అంటూ ప్రకటించింది. దీనిపై దరఖాస్తు దారులు మండిపడుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ లేకుండా రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడేదో ఉద్ధరించినట్లు 25శాతం రాయితీ పేరుతో సర్కారు డ్రామాలు ఆడుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎదురుచూస్తున్న వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని, డబ్బులు వసూలు చేసేందుకు సిద్ధమైందని పలువురు విమర్శిస్తున్నారు.

### 2020 ఆగస్టులోపు చేసుకున్నవారికేనా.. స్పష్టత కరువై గందరగోళం..

2020, ఆగస్టు నుంచి అక్టోబర్ 31 దాకా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రెండు నెలల పాటు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు స్వీకరించింది. వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరించింది. క్షేత్రస్థాయిలో ఎదురైన ఇబ్బందులు, చార్జీలపై రియల్ ఎస్టేట్ సంఘాల నుంచి అభ్యంతరాలు రావడంపై, కోర్టు కేసుల నేపథ్యంలో ప్రక్రియ నిలిచిపోయింది. అప్పుడు వచ్చిన దరఖాస్తులనే పరిష్కరించి, సొమ్ము చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు సిద్ధమైంది. 2020, ఆగస్టు 26కు ముందు ఏర్పాటు చేసిన లే-అవుట్‌లలోని ప్లాట్‌లను క్రమబద్ధీకరిస్తారని తెలుస్తున్నది. దరఖాస్తు చేసుకున్నా, చేసుకోకపోయినా నిర్దేశించిన గడువులోపు లే-అవుట్‌లో 10 శాతం ప్లాట్‌లను రిజిస్టర్ సేల్‌డీడ్ ద్వారా విక్రయిస్తే.. మిగిలిన 90 శాతం ప్లాట్‌ల క్రమబద్ధీకరణకు ఛాన్స్ ఇస్తారని చెబుతున్నారు. ఇలా ఉన్నవారంతా మార్చి 31లోగా క్రమబద్ధీకరణ, ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లిస్తే 25శాతం రాయితీ ఇస్తారని తెలుస్తున్నది. ఈ మేరకు జీవో విడుదల చేసినట్లు చెబుతున్నా.. ఆ విషయంలో ఇప్పటి వరకు క్లారిటీ రాకపోవడం కాస్త గందరగోళంగా మారింది. ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. ఎల్1, ఎల్2, ఎల్3 అని మూడు విభాగాలు ఉంటాయి. ఇందులో ఎల్1 అంటే టీపీబీవోలు క్షేత్రస్థాయికి వెళ్లి స్థలాన్ని చూశాకే నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్‌జోన్, చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, వక్ఫ్ భూములు ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా.. లేకపోతే అన్ని సరిగ్గానే ఉన్నాయా అని పరిశీలించి రిపోర్ట్ ఇస్తారు. అదయ్యాక రెండో దశలో ఎల్2లో టీపీవో, టీపీఎస్ సరిచూసుకొని ఓకే చేస్తే, మూడో దశ ఎల్3లో మున్సిపల్ కమిషనర్ వాటికి ఆమోద ముద్ర వేస్తారు. ఈ పెండింగ్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని, దాదాపు 90శాతం పని పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు.

### సామాన్యులపై గుదిబండ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 11 మున్సిపాలిటీల పరిధిలో 2020లో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులు 88,283 ఉండగా, వీటిలో 22వేల పైచిలుకు దరఖాస్తులను అప్పుడే పరిష్కరించారు. దాదాపు మరో 66వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా మంచిర్యాల మున్సిపాలిటీలో 18,933, ఆదిలాబాద్‌లో 14,208, నిర్మల్‌లో 11,429, భైంసాలో 8,950, క్యాతన్‌పల్లిలో 5,797 ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ అప్లికేషన్లు ఉన్నాయి. వీటన్నింటినీ ఇప్పుడు క్రమబద్ధీకరించనున్నప్పటికీ... ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు కట్టాల్సి రావడం సామాన్యులకు పెనుభారంగా మారనున్నది. పట్టణ ప్రాంతాల్లో ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకునేందుకు ఒక్క ప్లాట్‌లపై తక్కువలో తక్కువ రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అవుతుంది. ఈ మొత్తం కట్టి ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకున్నాక, ఆ క్లియరెన్స్ సర్టిఫికెట్‌తో రిజిస్ట్రేషన్ సైతం చేయించుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ మరోసారి రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో దరఖాస్తుదారుకు సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు భారం పడుతుంది. ఈ మొత్తం చెల్లించడం సామాన్యులకు తలకుమించిన భారమని పలువురు అంటున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, ఉచితంగా ప్లాట్‌లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో 2020లో వచ్చిన ఎల్ ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు ఇలా..**

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తులు | పరిష్కరించినవి | పెండింగ్‌లో ఉన్నవి |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 19,430 | 5,222 | 14,208 |
| నిర్మల్ | 15,413 | 3,984 | 11,429 |
| ఖానాపూర్ | 1,910 | 1,184 | 726 |
| భైంసా | 10,800 | 1950 | 8,850 |
| కాగజ్‌నగర్ | 1,845 | 150 | 1,695 |
| మంచిర్యాల | 22,954 | 4,021 | 18,933 |
| లక్షెట్టిపేట | 2,163 | 311 | 1,852 |
| చెన్నూర్ | 1,321 | 28 | 1,293 |
| నస్పూర్ | 4,921 | 4,024 | 897 |
| క్యాతన్‌పల్లి | 7,111 | 1,314 | 5,797 |
| బెల్లంపల్లి | 415 | 0 | 415 |
| మొత్తం | 88,283 | 22,188 | 66,095 |

### సామాన్యులపై భారం



గెలిస్తే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కారు నిలబెట్టుకోవాలి. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకొని ఓట్లు కొల్లగొట్టడం కోసమే సాధ్యం కాని హామీలు ఇచ్చింది. ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో మాట మార్చడం కాంగ్రెస్ మోసపూరిత విధానాలకు నిదర్శనం. ఎల్‌ఆర్‌ఎస్‌కు డబ్బులు కట్టాల్సి వస్తే సామాన్యులపై పెనుభారం పడుతుంది. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేయాలి.

*- పెంట రాజయ్య, మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్*

### ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలి



కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎల్‌ఆర్‌ఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలి. పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసేలా ఉచితంగా ప్లాట్‌లను క్రమబద్ధీకరించాలి. ఈ విషయంలో మాట మార్చిన కాంగ్రెస్ పార్టీ పై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఏండ్లుగా ఎదురుచూస్తూ, ఉచితంగా అవుతుందని పెట్టుకున్న ఆశలను ఈ సర్కారు అడియాశలు చేసింది. ఇచ్చిన మాటకు కట్టుబడి సామాన్యులను న్యాయం చేయాలని కోరుతున్నాం.

*- గాదె సత్యం, బీఆర్‌ఎస్ మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు*




మూతబడిన తిర్యాణిలోని దాల్ మిల్




మూసి ఉన్న వాంకిడిలోని దాల్ మిల్

# మూతపడ్డ మినీ పరిశ్రమలు

- తుప్పబడుతున్న దాల్ మిల్లుల యంత్రాలు
- నీరుగారుతున్న లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : మహిళా సంఘాలకు చేయూతనందించి, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత సర్కారు ఏర్పాటు చేసిన మినీ పరిశ్రమలు మూతబడ్డాయి. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఈ దాల్ మిల్లులు, అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. 2017లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా వనబంధు కల్యాణ యోజన పథకం కింద వాంకిడి, తిర్యాణి, కెరమెరి మండలాల్లో గత ప్రభుత్వం దాల్ మిల్లులు (పప్పు మిల్లులు) ఏర్పాటు చేసింది. ఒక్కో దాల్‌మిల్ యూనిట్‌కు రూ. 7.80 లక్షల చొప్పున ఐటీడీఏ ద్వారా అందించి ప్రారంభించింది. గిరిజన ప్రాంతాల్లో కందులు కొనుగోలు చేసి.. వాటిని పప్పులుగా మార్చి జీసీసీకి సరఫరా చేసి.. అక్కడి నుంచి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు పప్పులను అందించేలా చర్యలు తీసుకున్నది. వాంకిడిలోని మిల్లులో యేడాదికి 218క్వింటాళ్ల చొప్పున కందులు పట్టించి, అపై 147క్వింటాళ్ల పప్పును తయారు చేసి ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేశారు. క్వింటాలుకు రూ. 9వేల చొప్పున విక్రయించారు. యేడాదిలో దాదాపు రూ. 1.50లక్షల వరకు ఆదాయం పొందారు. తిర్యాణిలో 270 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసి, 200క్వింటాళ్ల పప్పును ఉత్పత్తిచేసి రూ. 1.80లక్షల వరకు ఆదాయాన్ని పొందారు. కెరమెరి దాల్‌మిల్‌లో 152 క్వింటాళ్ల కందులు కొని.. పప్పు తయారు చేసి విక్రయించడం ద్వారా రూ. 1.50 లక్షల వరకు ఆదాయం పొందారు. మొదట మిల్లులు బాగానే నడిచినప్పటికీ ఆ తర్వాత పట్టించుకునే నాథుడు లేకపోవడం.. మహిళా సంఘాలకు సకాలంలో బిల్లులు చెల్లించడంలో ఆలస్యం కావడంతో అవి నష్టాల బాటపట్టాయి. వాటిని తెరిచేందుకు ప్రస్తుత ప్రభుత్వంగాని, అధికారులుగాని చొరవ చూపకపోవడంతో విలువైన యంత్రాలు తుప్పుబట్టిపోతున్నాయి.



తిర్యాణి దాల్ మిల్‌లో తుప్పబడుతున్న యంత్రాలు

### నష్టాలతోనే మూత



దాల్‌మిల్ ప్రారంభించిన మొదటి రెండేళ్లు బాగానే నడిచింది. తర్వాత బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీనికి తోడు కందుల ధరలు పెరగడం.. వాటిని ప్రాసెస్ చేసి పప్పు విక్రయించడంలోనూ సరైన అవగాహన లేక కొంత నష్టాలు వచ్చాయి. దీంతో దాల్‌మిల్ క్రమంగా మూతపడి పోయింది.

*-ఆత్రం భీంరావు, ఐకేపీ సీసీ, తిర్యాణి*

# ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, ఫిబ్రవరి 21 : ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించే శాసన మండలి ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో పట్టభద్రుల శాసన మండలి సభ్యుల ఎన్నికల కోసం 40 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల ఎన్నిక కోసం 18 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

### కాసిపేటను నంబర్ వన్‌గా నిలపాలి

కాసిపేట, ఫిబ్రవరి 21 : అక్షరాస్యతలో కాసిపేట మండలాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలపాలని కలెక్టర్ కు మార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ సహకారంతో ఏర్పాటు చేసిన అక్షరాస్యత కేంద్రాలతో పాటు ఉపాధి కుట్టు శిక్షణ కేంద్రాలను జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్, సీనియర్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఆ నంద్ కులకర్ణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీవో వెంకటశ్వర్ రావు, డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో కిషన్, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, లైజనింగ్ ఆఫీసర్ తిరుపతి, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వర స్వామి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, విద్యాశాఖ నాణ్యతా సమన్వయకర్త సత్యనారాయణ మూర్తి, సీడీపీవో స్వరూపారాణి, ఏపీఎం వెంకటేశ్వర్లు, వయోజన విద్య శాఖ డీఆర్‌పీలు శాంకరి, కొండు జనార్దన్, సుమన్ పాల్గొన్నారు.

### కోనూరు, తాటిగూడలో పర్యటన

కోనూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన అంకతి సత్తయ్య పశువుల పాక, కంపోస్ట్ పిట్‌ను సందర్శించా రు. తాటిగూడలోని దిశ ఆదర్శ పాఠశాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చే యాలని ఆదేశించారు. అదే పాఠశాలలోని అంగన్‌వాడీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. ఈ సందర్భంగా కాసేపు విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పాఠం చెప్పారు.

### నీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు రూపొందించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21 : వేసవిలో ప్రజలకు తా గునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నా రు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావుతో కలిసి కార్యాలయ రిజిస్టర్లు, ప్రజాపాలన సేవా కేంద్రాలను పరిశీలించారు. తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో ఇంటింటికీ నిరంతరాయంగా తాగునీటిని అందించాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# ఇసుక, మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 21 : జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రతినిధులతో ఇసుక, మట్టి రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్, ట్రాన్స్‌ఫోర్ట్, అటవీశాఖల అధికారులతో జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

వేసవి సమీపిస్తున్నందున మున్సిపాలిటీల పరిధిలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు, మున్సిపల్ రెవెన్యూ అధికారులు, వార్డు అధికారులతో తాగునీరు, పారిశుధ్యం, ఆస్తి పన్ను వసూళ్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పైప్‌లైన్లు, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

### పశువులకు సకాలంలో శస్త్ర చికిత్సలు అందించాలి

జిల్లాలోని పశువులకు సకాలంలో శస్త్ర చికిత్సలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పశు వైద్య కార్యాలయానికి సంబంధించిన ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ పశుగణన ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకొని.. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సురేశ్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.